క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్ తనిఖీ



ఎస్సీ హాస్టల్‌లో డీఎస్‌డబ్ల్యూఓ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి రాజ్యలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఇక్కడి పిల్లలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. భోజనానికి వినియోగిస్తున్న వస్తువులు, కూరగాయల క్వాలిటీని పరీక్షించారు. 'అప్పు చేసి పప్పుకూడు' శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వెలువడిన కథనంపై ఆమె ఈ తనిఖీలు చేశారు. హాస్టళ్లకు సంబంధించి బకాయి మెస్ బిల్లులు త్వరలో అందుతాయని తెలిపారు. స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ హైమావతి, హాస్టల్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గిరిజా కల్యాణం

కుప్పం: పట్టణంలోని రామచంద్రా రోడ్డులో నూతనంగా నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయంలో శుక్రవారం గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం మండలాభిషేకం నిర్వహించి అనంతరం స్వామి వారికి రుద్రాభిషేకం, సాయంకాలం గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సోడిగానిపల్లిలో ప్రజాదర్బార్

గుడుపల్లె: మండలంలోని సోడిగానిపల్లి పంచాయతీలో శుక్రవారం ఉదయం 10 గంటల ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ప్రజాదర్బార్‌కు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో జరగనున్నట్లు చెప్పారు. ప్రజాదర్బార్‌కు అన్ని శాఖల అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే అర్జీలు ఇస్తే పరిష్కారం చూపనున్నట్లు రాధాకృష్ణ పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



సమీక్షలో ఆర్డీఓ భవాని

సదుం: సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషిచేయాలని పలమనేరు ఆర్డీఓ భవాని సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. భూముల రీసర్వే వినతులపై సమీక్ష నిర్వహించారు. మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో 1,392 వినతులు అందినట్లు అధికారులు ఆమెకు తెలిపారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్ఎం హుస్సేన్, డీటీ కుమార్, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

30న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ అంశాలను చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

రేపు కార్తీక దీపోత్సవం

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పుష్కరిణిలో ఈనెల 30న అమావాస్య సందర్భంగా పార్థివలింగ పూజా కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పూజలతోపాటు రాత్రి లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రతిఒక్కరూ సంప్రదాయ దుస్తులతో పూజాకార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

చేయి తడిపితేనే ఆడిట్!



పంచాయతీల్లో ఏటా నిర్వహించే ఆడిట్‌లో ఆడిటర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పంచాయతీ రికార్డులు సక్రమంగా ఆడిటర్లకు అమ్యామ్యాలు ఇవ్వందే ఆడిట్ చేయడం లేదు. రికార్డులు సక్రమంగా ఉంటే 2శాతం హెచ్చుతగ్గులు ఉంటే 3శాతం పైగా వసూలు చేస్తూ విమర్శల పాలవుతున్నారు. కొంతమంది సర్పంచులు అయితే ఈ ఆడిటర్లతో తాము వేగలేమని లబోదిబోమంటున్నారు.

– గుడుపల్లె

- లేదంటే కొర్రీలు పెట్టి అడ్డుపెడుతున్న ఆడిటర్లు
- సక్రమమైతే 2శాతం, హెచ్చుతగ్గులైతే 3 శాతం పైచిలుకు
- గుడుపల్లె మండలంలో పంచాయతీ ఆడిటర్ల రూటే వేరు
- లబోదిబోమంటున్న సర్పంచులు

సక్రమమైతే 2శాతం..లేదంటే 3 శాతం పైచిలుకు

ఏటా పంచాయతీలో జరిగే లావాదేవీలపై ప్రభుత్వం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ ఆడిట్ చేసేందుకు చిత్తూరు నుంచి ఆడిటర్లు ఒక్కో పంచాయతీకి వస్తారు. వచ్చిన నాటి నుంచి వారు వెళ్లే వరకు సకల సౌకర్యాలు వారికి కల్పించాల్సి ఉంది. ఇదీ కాకుండా రికార్డుల పరిశీలన సమయంలో పంచాయతీల్లో జరిగిన పనుల్లో 2శాతం మామూలు ఇవ్వాల్సి ఉంది. ఏదైనా ఓచర్లు, బిల్లులు, పనులకు సంబంధించి తీర్మానాలు లేకపోయినా, ఇంటి పన్నుల్లో తప్పులు ఉన్నా 3శాతానికి పైగా డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ మేరకు ఇవ్వకుంటే ఆడిట్‌లో అవకతవకలు చూపి రిమార్కులు రాస్తున్నారు. సర్పంచులు సానుకూలంగా స్పందిస్తే బిల్లులు, ఓచర్లు , పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానాలు లేకపోయినా ఆడిట్ సవ్యంగా జరిగిపోతుంది. దీంతో ఒక్కో పంచాయతీపై రూ.20 వేల నుంచి ఆపై వరకు భారం పడుతుండడంతో సర్పంచులు లబోదిబోమంటూ నిర్వేదనకు గురవుతున్నారు. ఇవే కాకుండా పంచాయతీ నుంచి ప్రభుత్వానికి చెల్లించిన ప్రభుత్వ చెల్లింపులపై సైతం డిమాండ్ చేస్తుండడంతో సర్పంచులు విస్తుపోవాల్సి వస్తోంది.

గుట్టుచప్పుడు కాకుండా ఆడిట్

సంవత్సరానికి ఓ మారు నిర్వహించే పంచాయతీ ఆడిట్‌లు ఆయా పంచాయతీ కేంద్రంలో నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్ గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. మూడు, నాలుగు పంచాయతీలు కలిపి ఆడిటర్లకు అనుకూలంగా ఉన్న ప్రదేశాల్లో ఆడిట్లు చేపడుతూ విమర్శల పాలవుతున్నారు. సర్పంచులు, కార్యదర్శులు సైతం చేసేది లేక ఎక్కడికి పిలిస్తే అక్కడికి రికార్డులు తీసుకెళ్లి ఆడిట్లు చేసుకోవాల్సిన పరిస్థితి తయారైంది.

ఒక్కో పంచాయతీకి సంవత్సరంలో వచ్చే నిధులు

1. 14, 15 ఫైనాన్స్ నిధులు
2. తలసరి గ్రాంటు
3. రిజిస్ట్రేషన్ ఫీజు
4. ఇంటి పన్నులు
5. మినరల్ సెస్సు





మండలంలోని ఓ పంచాయతీలో జరుగుతున్న ఆడిట్

ఆడిట్ ఖర్చులు ఏ ఖాతాలో చూపాలి?

ఆడిటర్‌కు ఇచ్చే రూ.20 వేలు ఏ ఖాతాలో తాము చూపాలని సర్పంచులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. రూ.20 వేల నుంచి పంచాయతీ ఆదాయాన్ని బట్టి ఎక్కువగా చెల్లించే ఆడిటర్ ఖర్చులను ఏఖాతాలో చూపాలి?... రేపు ఎవరైనా ప్రశ్నిస్తే తాము సమాధానం ఏమి చెప్పాలో పాలుపోక సర్పంచులు లోలోన మదనపడుతున్నారు. ఈ విషయాన్ని బయట పెడితే పంచాయతీపై కక్ష కట్టి రిమార్కులు రాస్తారని సర్పంచులు తమ గోడు చెప్పుకోలేక కుంగిపోతున్నారు. ఆడిటర్‌కు ఎందుకు డబ్బులు ఇవ్వాలని కొంత మంది సర్పంచులు ఎదురు ప్రశ్నిస్తే కార్యదర్శులు దగ్గరుండి వారి నుంచి వసూలు చేసి ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై జిల్లా ఆడిట్ అధికారి రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా, ఎవరైనా సర్పంచులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆడిటర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రమాదేవికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన చలపతి భార్య రమాదేవికి గురువారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు రూ.75వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున అన్ని విధాలా సాయం అందించి కుటుంబసభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ కుటుంబసభ్యులకు సమస్యలు ఉంటే నేరుగా సంప్రదిస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.

అయ్యప్పస్వామికి జెడ్పీ చైర్మన్ పూజలు



పూజల్లో జెడ్పీ చైర్మన్

వి.కోట: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి గుడిలో గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్వామి వారికి విశిష్ట పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హోరాహోరీగా జోనల్ క్రీడలు



విన్నర్స్ పుదిపట్ల జట్టు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన పుంగనూరు జోనల్ గ్రిగ్ మెమోరియల్ ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను ఎంఈఓ కేశవరెడ్డి, హెచ్ఎం పద్మజ, పాఠశాల కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 25 బాలబాలికల జట్లు హాజరై పోటీల్లో తలపడ్డారు. సీనియర్ బాలుర పోటీల్లో పుదిపట్ల విన్నర్స్, చౌడేపల్లె రన్నర్స్‌గా గెలుపొందారు. సీనియర్ బాలికల పోటీల్లో పుదిపట్ల విన్నర్స్, రొంపిచెర్ల రన్నర్స్‌గా విజయం సాధించారు. జూనియర్ బాలుర ఖోఖో పోటీల్లో చౌడేపల్లెలోని విజయవాణి (గురుకులం) విన్నర్స్, విజయవాణి(ఐసీఎస్ఈ) రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ బాలికల విభాగంలో పుదిపట్ల విన్నర్స్, మేలుపట్ల రన్నర్స్‌గా విజయం సాధించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. రిటైర్డ్ పీడీ రామచంద్ర, పీడీలు వెంకటేష్, రాజేంద్ర పాల్గొన్నారు.



రన్నర్స్ చౌడేపల్లె జట్టు

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి



యువరాజ్ కాంప్లెక్స్‌లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సీపీఎం నేతలు

పలమనేరు: ప్రజలకు ఇబ్బందిగా మారే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని స్థానిక సీపీఎం నాయకులు గిరిధర్ గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు పలమనేరు పట్టణంలో ట్రాన్స్‌కో సిబ్బంది దొంగచాటుగా కార్యాలయాలు, దుకాణాల సముదాయాలకు బిగిస్తుండగా గురువారం వారు అడ్డుకున్నట్టు తెలిపారు. గతంలో చంద్రబాబు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని చెప్పి స్మార్ట్ మీటర్లను అమర్చితే పగులగొట్టాలని చెప్పారన్నారు. ఇప్పుడు అదే కూటమి పాలనలో చంద్రబాబు ఆదేశాలతోనే వీటిని ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమన్న చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలను పెంచడం దారుణంగా ఉందన్నారు. దీనిపై త్వరలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

పట్టాల మంజూరుకే గ్రామసభ



మాట్లాడుతున్న మురళి

పెద్దపంజాణి: గిరిజనులు 2006 సంవత్సరానికి ముందు అటవీ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేసేందుకు గ్రామసభ నిర్వహించినట్లు గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ సహాయకులు మురళి పేర్కొన్నారు. గురువారం ఎర్రమ్మ చెరువు కాలనీలో సర్పంచ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీశాఖ, గిరిజన రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన కాలనీకి సంబంధించి 15 మంది సభ్యులతో అటవీ హక్కుల చట్టం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలుగా నారాయణమ్మ, కార్యదర్శిగా ఆదిలక్ష్మిని ఎంపిక చేశారు. ఈఓపీఆర్డీ శారదాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, ఏపీఓ మురుగేషన్, ఎఫ్‌బీఓ చంద్రబాబు, బాలసుబ్రమణ్యం, వీఆర్వో సతీష్ బాబు, పీఎస్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సైరన్ తాళాలతో చోరీలకు చెక్



దుకాణదారునికి తాళాలను అందజేస్తున్న ఎస్‌ఐ

చౌడేపల్లె: సైరన్ తాళాలతో దుకాణాలు, ఇళ్లలో చోరీలకు చెక్ పెట్టవచ్చని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. గురువారం చౌడేపల్లెలో పలు షాపుల యజమానులకు సైరన్ తాళాలను ఎస్ఐ అందజేశారు. తాళాలను వాడే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. తాళం తాకితే సైరన్ మోగుతుందన్నారు. ముందస్తుగా రూ.400 చెల్లించి ఆర్డర్ చేసుకున్న వారికి తాళాలను అందజేస్తామన్నారు. మండలంలో 40 మందికి సైరన్ తాళాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, మహిళా సంరక్షురాలు ప్రభావతి, దుకాణదారులు పాల్గొన్నారు.

పింఛన్లు రేపే తీసుకోండి

వి.కోట: డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈనెల 30 తేదీనే పింఛన్‌దారులకు పింఛన్ అందిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పంపిణీ ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు శనివారం 30వ తేదీనే పింఛన్లను తీసుకోవాలని ఆయన సూచించారు. ఇందుకు సంబంధించి ఆయా సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా ముందస్తు పింఛన్ పంపిణీపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు





పిల్లలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, అవగాహన కల్పిస్తున్న డా.జానకిరావు

గంగవరం: మండలంలో గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలను ఆరోగ్యసిబ్బంది గురువారం నిర్వహించారు. బూడిదపల్లిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బాల్యంలో వచ్చే పలు రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జీఎల్ఎస్‌ఫార్మ్ జెడ్పీ హైస్కూల్‌లో వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో 170 మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం కల్లూరు హైస్కూలు విద్యార్థులు వంద మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డా.జానకిరావు తెలిపారు. పిల్లలకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం వివిధ రకాల రోగాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో కుప్పం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

కుప్పంరూరల్: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల విభాగం ఆధ్వర్యంలో చిత్తూరులో ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యువఉత్సవ్‌లో కుప్పం పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. విద్యార్థులు శివశంకర్, శాంసన్ తయారు చేసిన 'లో కాస్ట్ మోటరైజ్ ఫుడ్ ఫీడర్ ఫర్ లింబ్‌లెస్' అనే ప్రయోగానికిగాను సైన్స్ మేళాలో ప్రథమ బహుమతి వచ్చినట్లు తెలిపారు. వీరికి రూ.7 వేలు పొందినట్లు చెప్పారు. అదే విధంగా మొదటి సంవత్సరం విద్యార్థి లోహిత్ తయారు చేసిన 'బ్లైండ్ స్టిక్ యూజింగ్ ఆర్డినో'(అంధుల చేతి కర్ర)కు ప్రథమ బహుమతితోపాటు రూ.3 వేల నగదు బహుమతి వచ్చినట్లు తెలిపారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 17 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పొందినట్లు చెప్పారు. గురువారం బహుమతి పొందిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది.

మత్తుకు జీవితాలను చిత్తు చేసుకోవద్దు





మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం

–పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: యువత మాదకద్రవ్యాల మత్తుకు బానిసై జీవితాలను చిత్తు చేసుకోరాదని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సూచించారు. ఆమేరకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల రహిత ఏపీ, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశాలపై గురువారం జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చెడు స్నేహాల ద్వారా మత్తు పదార్థాలకు విద్యార్థులు సైతం బానిసలు కావడం బాధాకరమన్నారు. దీంతోపాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, ఇంటర్‌నెట్‌ను ఎక్కువగా వినియోగించడం మంచిది కాదన్నారు. గంగవరం సీఐ ప్రసాద్, ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మదర్‌థెరీసా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్రమణ్యం మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే





పలమనేరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నేతల నివాళి, పుంగనూరులో..

–ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి

పలమనేరు: కులం పేరిట అణచివేయబడుతున్న వారికి ఆశాజ్యోతిగా నిలిచి వారి కోసం పోరాటాలు చేసిన మహానేత జ్యోతిరావు పూలేనని, ఆయన బాటలో నేటి సమాజం పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలమనేరు వైఎస్సార్‌సీపీ నేతలు మండీ సుధా, మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాలతో నేతలు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, రహీంఖాన్, హరీష్, రెడ్డెప్పరెడ్డి, రఘునాథ్, హైదర్, నవీన్, ఈశ్వర్‌రెడ్డి, రవి, భరత్ పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని నియోజకవర్గ బీసీ ఫ్రంట్ సంఘ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, గోవిందుస్వామి, అద్దంకి రమణమూర్తి, బీసీ ఎంప్లాయీస్ సంఘ నేత లక్ష్మీపతియాదవ్, ఆనందగౌండర్, నంజుడప్ప, రామ్మూర్తి, బలరాం కుట్టి పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ నేతలు పూలేకు నివాళులర్పించారు.

జ్యోతిరావు పూలేకు నివాళి

పెద్దపంజాణి: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. పట్టణ బీజేపీ నేతలు అయూబ్‌ఖాన్, నరసింహులు, దళిత నాయకుడు పెంచుపల్లి కృష్ణ, బీసీ నాయకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి, వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట పూలే వర్ధంతిని జరుపుకున్నారు. ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు డాక్టర్ రఘునాథ్, శివప్రసాద్‌నాయుడు, నారాయణస్వామి, గిరిబాబు, ఓబులేసు, నూరేషా, వెంకటముని, బండపల్లె సుభాష్, మల్లయ్య, రఫి, సైపుల్లాఖాన్ పాల్గొన్నారు.





పలమనేరు: నివాళులర్పిస్తున్న బీసీ ఫ్రంట్ నేతలు, పెద్దపంజాణి: పూలేకు నివాళులర్పిస్తున్న నేతలు

అభివృద్ధికి నోచని ఎకో టూరిజం

రామకుప్పం: పక్షుల కిలకిలారావాలు..చల్లని వాతావరణం ..ఎటు చూసినా పచ్చదనం...ననియాల ఎకో టూరిజం సొంతం. ఇక్కడి వాతావరణం ప్రకృతి ప్రేమికులను ఇట్టే కట్టిపడేస్తుంది. చెన్నై, బెంగళూరు నగరాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారాంతాల్లో ఇక్కడికి వచ్చి సేద దీరడానికి ఇష్టపడుతుంటారు. ప్రకృతి సోయగాలకు నెలవైన ఎకో టూరిజం అభివృద్ధికి నోచుకోకపోవడంతో పర్యాటక ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2017–18 మధ్య రూ.8 కోట్ల అంచనాలతో టీడీపీ ప్రభుత్వం స్విమ్మింగ్‌పూల్, వాటర్ ఫౌంటైన్లు, హెలిప్యాడ్, కాటేజీలు, వాచ్ టవర్, కేఫ్టేరియా నిర్మాణ పనులను ప్రారంభించింది. ఇందులో భాగంగా సోలార్ ఫెన్సింగ్, గార్డెన్, బిల్డింగ్ పనులు పూర్తి చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎకో టూరిజంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఎకో టూరిజం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది.

ఆకట్టుకుంటున్న వినాయక్, జయంత్

ఎకో టూరిజంలోని ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణ పొందిన ఏనుగులు వినాయక్, జయంత్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటోంది. వీటితో ఫొటోలు దిగడానికి పర్యాటకులు పోటీపడతారు.



వినాయక్, జయంత్

చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులో సమయం గడపడానికి చిన్న, పెద్ద తేడా లేకుండా సెలవుల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అంతేగాక ననియాల ఆనుకుని ఉన్న వాచ్ టవర్ పైనుంచి చూస్తే అటవీ అందాలను పర్యాటకులు ఆస్వాదించవచ్చు.

ఎకో టూరిజంను సందర్శించిన ప్రముఖులు

ఎకో టూరిజం అందాలను ఆస్వాదించడానికి పలువురు ప్రముఖులు విచ్చేస్తుంటారు. ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉన్న అధికారులు, బిజీగా ఉన్న ప్రజాప్రతినిధులు ఎకో టూరిజంలో సేద దీరడానికి వస్తుంటారు. రాజకీయ ప్రముఖులు వారి కుటుంబాలతో వచ్చి సమయం గడుపుతూ ఉంటారు.

ఎకో టూరిజం ప్యాకేజీతో జాతీయస్థాయి గుర్తింపునకు అవకాశం

ఎకో టూరిజం నుంచి నడుమూరు ఎకో టూరిజం పార్కు, మల్లప్ప కొండ, బేటరాయస్వామి ఆలయాల వరకు టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తే ననియాల ఎకో టూరిజం అభివృద్ధి చెందడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతోపాటు మదనపల్లి, కుప్పం, రామకుప్పం పర్యాటక కేంద్రాలను కలుపుతూ ఏపీ టూరిజం ద్వారా ప్యాకేజీ తీసుకొస్తే ఎకో టూరిజం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని స్థానికులు చెబుతున్నారు. అంతేగాక స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. అధికారులు స్పందించి ఎకో టూరిజం పనులను పూర్తి చేసి పర్యాటకులకు, ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నారు.